క్లుప్తంగా

పెండింగ్ వేతనాలను చెల్లించాలి



నందిగామ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే పారిశుద్ధ్య కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు అందకపోవటంతో కుటుంబ పోషణ భారంగా మారుతుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ పేర్కొన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే శానిటేషన్ వర్కర్స్ యూనియన్ సమావేశం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటవ తేదీన వేతనాలను కార్మికుల ఖాతాలలో జమ చేయటంతో పాటు పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.26 వేల కనీస వేతనం అందించాలన్నారు. కార్మికులకు ప్రభుత్వం ప్రమాద బీమా సౌకర్యం కల్పించి, హెల్త్ కార్డులు, నాలుగు జతల యూనీఫామ్‌లు అందించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు మైమున్, వరలక్ష్మి, లావణ్య, అన్నపూర్ణ, సువార్త, బేబి, వసంత, కమలమ్మ, దివ్య, తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారుల ఆర్థికాభివృద్ధికి కృషి



నందిగామ రూరల్: సోషల్ ఎకనమిక్ సర్వే ఆధారంగా వీధి వ్యాపారులకు రుణ సౌకర్యం కల్పించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయటమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని మెప్మా పీడీ మురళీకృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో మంగళవారం లోక్ కల్యాణ్ మేళాపై వీధి వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధి వ్యాపారులకు రూ.50 వేల వరకు రుణం అందించటం జరుగుతుందన్నారు. వీధి వ్యాపారులు డిజిటల్ చెల్లింపులు చేయాలని సూచించారు. గుర్తింపు కార్డులున్న వారికే రుణాలు, ప్రభుత్వ పథకాలు అందుతాయని చెప్పారు. అనంతరం వీధి వ్యాపారుల నుంచి రుణ దరఖాస్తులను స్వీకరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, కమిషనర్ లోవరాజు, టీఈఎల్‌హెచ్ సుధారణి, డీఆర్పీ యామిని, మెప్మా సిబ్బంది, ఆర్పీలు, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్స్ తనిఖీ



నందిగామ టౌన్: మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ లోవరాజు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రైవేట్ మినరల్ వాటర్ ప్లాంట్‌లను మున్సిపల్ సిబ్బందితో కలిసి మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాటర్ ప్లాంట్‌లను తనిఖీ చేశామన్నారు. వాటర్ ప్లాంట్‌లలోని నీటి నమూనాలను సేకరించి గుంటూరులోని రీజినల్ పబ్లిక్ హెల్త్ లాబొరేటరీకి పంపినట్లు తెలిపారు. వాటర్ ప్లాంట్ నిర్వాహకులు సేఫ్ వాటర్ పారామీటర్స్ ప్రకారం తాగునీటిని సరఫరా చేయాలన్నారు. ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌ల ఏర్పాటుకు ప్రభుత్వ అనుమతులు తప్పనిసరని, అనుమతులు లేకుండా ప్లాంట్‌లు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఈ ఫణిశ్రీనివాస్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు కొత్త పెన్షన్లు మంజూరు చేయాలి

జగ్గయ్యపేట అర్బన్: దివ్యాంగులకు కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని దివ్యాంగుల సంఘం జగ్గయ్యపేట నియోజకవర్గ అధ్యక్షుడు వడ్డేపూడి ఉమామహేశ్వరరావు కోరారు. ఈమేరకు మంగళవారం అంతర్జాతీయ బధిరుల దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల దివ్యాంగుల మరియు వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ కామరాజ్, సూపరింటెండెంట్ ప్రశాంతిలను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలోని దివ్యాంగులకు బ్యాటరీ సైకిళ్లు, వినికిడి యంత్రాలు, చంక కర్రలను అందజేయాలని ఏడీని కోరామన్నారు. స్పందించిన ఏడీ కామరాజ్ రాబోయే రెండు నెలల్లో అందించడానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారన్నారు.

ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌గా హరికృష్ణ

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట సామాజిక ఆరోగ్య కేంద్రం నూతన సూపరింటెండెంట్‌గా డాక్టర్ అడ్డగిరి హరికృష్ణ నియమితులయ్యారు. కృష్ణా జిల్లా డీసీహెచ్ఎస్ ఉత్తర్వుల మేరకు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సూరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ ఆళ్ల హరీష్ బాధ్యతలను నుంచి రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ హరీష్ మాట్లాడుతూ ఈ ఆస్పత్రి నిర్వహణకు, అభివృద్ధికి సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇక ముందు కూడా ఇదే ఆస్పత్రిలో తాను సివిల్ అసిస్టెంట్ సర్జన్, ఆర్థోపెడిక్స్‌గా ప్రజలకు సేవలను అందిస్తానని తెలిపారు.

తాగునీటికి తప్పని తిప్పలు

- తాగునీటికోసం మునగచర్ల వాసుల ముప్పతిప్పలు
- దాహం తీరాలంటే పక్క ఊరు వెళ్లాల్సిందే
- 20 రోజులుగా ఆగిన తాగునీటి సరఫరా
- శిథిలావస్థకు చేరిన ఓవర్ హెడ్ ట్యాంకు



తాగునీటిని సరఫరా చేసే ఓవర్ హెడ్ ట్యాంకు



పెచ్చులూడిన పిల్లర్

నందిగామరూరల్: మండలంలోని మునగచర్ల గ్రామంలో గడిచిన 20 రోజులుగా తాగునీరు సరఫరా కావటం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలంలో తాగునీటికి ఇబ్బందులు సహజం. కానీ వర్షాకాలంలో సైతం తాగు నీటికి అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొందని గ్రామస్తులు వాపోతున్నారు.

విషయం ఇదీ..

పెనుగంచిప్రోలు మండలం కొల్లికుళ్ల గ్రామంలోని రక్షిత మంచి నీటి పథకం నుంచి 25 కి.మీ పొడవున్న పైపులైన్‌ల ద్వారా మునగచర్ల ఓవర్ హెడ్ ట్యాంకుకు తాగునీరు సరఫరా అవుతుంది. ట్యాంకు నుంచి కుళాయిల ద్వారా ప్రజలకు తాగునీరు సరఫరా కావాల్సి ఉంది. అయితే పైపులైన్ లీకేజీల కారణంగా గ్రామానికి సక్రమంగా తాగునీరు సరఫరా కావటం లేదు. ఎన్నో ఏళ్లుగా ఈ సమస్య వెంటాడుతోంది. ఆర్థిక వెసులుబాటు ఉన్న వారు మినరల్ వాటర్ క్యాన్‌లను ఆశ్రయిస్తుండగా పేదలు మాత్రం అందుబాటులో ఉన్న బోరు నీటితో దాహం తీర్చుకుంటున్నట్లు చెబుతున్నారు. జల్‌జీవన్ మిషన్ కింద తాగునీటి సౌకర్యం కల్పించేందుకు నిధులు మంజూరైనా పథకం అమలు కార్యరూపం దాల్చలేదు.

పక్క ఊర్లకు పోవాల్సిందే..

తప్పని సరి పరిస్థితులలో మూడు, నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న హనుమంతపాలెం, నందిగామ పట్టణంలోని వాటర్ ట్యాంకుల వద్దకు వెళ్లి తాగు నీటిని తెచ్చుకుని జాగ్రత్తగా వాడుకుంటారు. రోజూ అంతంత దూరం వెళ్లి తాగునీటిని తెచ్చుకోవటం ఇబ్బందికరంగా ఉంటుందంటున్నారు.

ఫ్లోరైడ్ నీటి వల్ల..

గ్రామంలో బోరు నీటిలో ఫ్లోరైడ్ అధికంగా ఉంది. దీంతో అనారోగ్యం పాలవుతున్నారు. తాగు నీటిని సరఫరా చేసే వాల్వ్‌పిట్ సైతం మురుగు నీటి మధ్యలో ఉంది. వాల్వ్‌పిట్ లీకేజీల కారణంగా మురుగు నీరు తాగునీటితో కలుషితమై రంగుమారి వస్తున్నాయి. కలుషిత నీటిని తాగితే రోగాల బారిన పడాల్సి వస్తుందేమోనని ఆందోళన చెందుతున్నారు.

శిథిలావస్థలో ఓవర్ హెడ్ ట్యాంక్..

సుమారు నాలుగు దశాబ్దాల క్రితం గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించారు. అప్పటి నుంచి దాని ఆలనా పాలనా కరువవటంతో పూర్తి శిథిలావస్థకు చేరింది. పిల్లర్‌లు పెచ్చులూడి ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. ఓవర్ హెడ్ ట్యాంకుకు ఏర్పాటు చేసిన పైపులైన్‌లు కూడా తుప్పుపట్టి అధ్వాన స్థితికి చేరాయి. ఓవర్ హెడ్ ట్యాంకు ఎప్పుడైనా కూలిపోవచ్చని గ్రామస్తులు భయపడుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సమస్య పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

ఉన్నతాధికారులకు చెప్పాం

గ్రామంలోని తాగునీటి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పైప్‌లైన్ ఎక్కువ దూరం నుంచి రావటంతో పాటు పంట పొలాల మధ్య నుంచి వస్తుండటంతో నిత్యం పైప్‌లైన్ లీకవుతోంది. పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు చేపడుతున్నాం. రెండు, మూడు రోజుల్లో గ్రామానికి తాగునీటిని సరఫరా చేస్తాం.

– మురళీ కృష్ణ, కార్యదర్శి, మునగచర్ల



కాళ్లు నొప్పులతో వంకర్లు పోతున్నాయి

గ్రామానికి తాగునీరు సక్రమంగా సరఫరా కావటం లేదు. మినరల్ వాటర్ కొనుగోలు చేసి తాగుతున్నాం. లేకుంటే బోరు నీటితోనే సరిపెట్టుకుంటాం. బోరు నీటిలోని ఫ్లోరైడ్ నీటితో పాటు మినరల్ వాటర్ తాగటంతో కాళ్ల నొప్పులతో పాటు కాళ్లు వంకర్లు పోతున్నాయి. చాలా ఇబ్బందిగా ఉంటుంది.

– పంగులూరి పిచ్చయ్య, మునగచర్ల



చాలా ఇబ్బందులు పడుతున్నాం

గ్రామంలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. 20 రోజులకు ఒకసారి కూడా తాగునీటి సరఫరా కావటం లేదు. అరకొరగా వచ్చినా కలుషిత నీరు వస్తోంది. అధికారులు, ప్రజా ప్రతినిధులకు చెప్పినా ఫలితం ఉండటం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలి.

– రమేష్, స్థానికుడు



తాగునీటి కోసం 4.కి.మీ వెళ్లితెస్తున్నాం

మునగచర్ల గ్రామం నుంచి మూడు నాలుగు కిలో మీటర్ల దూరంలో ఉన్న హనుమంతపాలెం, నందిగామకు వెళ్లి తాగునీటిని తెచ్చుకుంటున్నాం. తాగు నీటికి అవస్థలు పడుతున్నాం. రోజూ అంత దూరం వెళ్లి తాగునీటిని తెచ్చుకోవటం కష్టం. మా తాగునీటి సమస్యను తీర్చాలి.


– వెంకట్రావ్, గ్రామస్తుడు



ముక్త్యాలలో గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారు



కంచికచర్ల పట్టణం వాసవీ మాత ఆలయంలో..




పెనుగంచిప్రోలులో శ్రీదుర్గామల్లేశ్వరి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో



కంచికచర్లలో మహాలక్ష్మీ ఆలయంలో శ్రీశైల మాతగా..



గాయత్రీ దేవి అలంకారంలో చందాపురం దుర్గామాత



గాయత్రీదేవిగా గోళ్లమూడి పార్వతీ మాత

భక్తిశ్రద్ధలతో దేవీశరన్నవరాత్రులు

రెండో రోజు ప్రత్యేక పూజలు

నందిగామ రూరల్: నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. నందిగామ పట్టణం, మండలంలోని ఆయా గ్రామాలలో ప్రత్యేక మండపాలలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలకు మంగళవారం ప్రత్యేకాలంకరణలతో పాటు విశేష పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. అంబారుపేట గ్రామంలో సత్యమ్మ అమ్మవారిని బాలాత్రిపురసుందరీ దేవిగా అలంకరించారు. ఈవో సీతారావమ్మ, ఆలయ చైర్మన్ మంచాల మాధవరావు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. లింగాలపాడులో లక్ష్మీపేరంటాళ్ల అమ్మవారు, దాములూరు కూడలి గ్రామంలోని సంగమేశ్వర స్వామి వారి ఆలయాలలో దసరా మహోత్సవాలలో పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. గోళ్లమూడి గ్రామంలో శంభులింగేశ్వర స్వామి వారి ఆలయంలోని పార్వతీ అమ్మవారు. పల్లగిరి గట్టుపై ఉన్న త్రిశక్తి పీఠంలో కనకదుర్గ, కనక మహాలక్ష్మి, జ్ఞాన సరస్వతీ అమ్మవార్లు గాయత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చందాపురం గ్రామంలో అమ్మవారు గాయత్రి దేవిగా దర్శనమిచ్చారు.

నందిగామ టౌన్: పట్టణంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో శుకశ్యామలాంబ అమ్మవారు బాలాత్రిపురసుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీ కన్యకా పరమేశ్వరీ, మరిడీ మమాలక్ష్మీ అమ్మవారిని గాయత్రీ దేవిగా అలంకరించారు. రామలింగేశ్వర నగర్‌లోని సాయి అయ్యప్ప ఆలయంలోని మాలికాపురత్తమ్మ దుర్గామాత గాయత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.



పెనుగంచిప్రోలు పాత సినిమాహాల్ సెంటర్‌లో..



చిట్టేల వెంకటేశ్వరస్వామి ఆలయంలో..



పేట నకాశిబజారులోని శ్రీకనకదుర్గ ఆలయంలో..

గాయత్రీదేవిగా దర్శనం

వత్సవాయి: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు మంగళవారం అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. వత్సవాయి, దబ్బాకుపల్లి, కంభంపాడు, భీమవరం, మక్కపేట, మంగొల్లు, చిట్టేల గ్రామాలలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాల వద్ద ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. మహిళలు రంగు రంగు పూలతో అందంగా తయారుచేసిన బతుకమ్మలను ఒకచోట చేర్చి ఆడిపాడారు. చిట్టేల వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటుచేసిన అమ్మవారి వద్ద ఆలయ నిర్మాణధర్మకర్త మారెళ్ల పుల్లారెడ్డి దంపతులు పూజాకార్యక్రమాలు చేశారు. బతుకమ్మలను స్థానికంగా కాలువలు, మునేరు, చెరువులలో నిమజ్జనం చేస్తున్నారు. అమ్మవారికి కట్టిన చీరలకు వేలం నిర్వహిస్తున్నారు.

నెహ్రూనగర్ వెంకటేశ్వర స్వామి ఆలయంలోని పద్మావతి అమ్మవారు, కనకదుర్గ నగర్‌లోని దుర్గామాత, రెవెన్యూ కాలనీలోని అంకమ్మ అమ్మవార్లను గాయత్రీ దేవిగా అలంకరించారు. ఆయా ఆలయాల ఈవోలు, నిర్వాహకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో రెండో రోజు మంగళవారం కుంకుమ పూజ నిర్వహించారు. పలువురు దంపతులు, అధికారులు పాల్గొన్నారు. తూర్పు బజారులో శ్రీదుర్గామల్లేశ్వరి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నవరాత్రుల పందిరిలో, పాత సినిమాహాల్ సెంటర్‌లో అమ్మవారిని శ్రీగాయత్రీదేవి అలంకరణలో భక్తులు దర్శించుకున్నారు. స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

కంచికచర్ల: స్థానిక వాసవీమాత ఆలయంలో వాసవీ మాతను గాయత్రీదేవిగా మంగళవారం అలంకరించారు. మహాలక్ష్మీ ఆలయంలో అమ్మవారిని శ్రీశైల మాతగా అలంకరించి పూజలు జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

జగ్గయ్యపేట: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దుర్గాదేవి మంగళవారం గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తిరుమలగిరి గ్రామంలో మల్లేశ్వర స్వామి, ముక్త్యాల గ్రామంలోని భవానీ ముక్తేశ్వర స్వామి వారి ఆలయాలలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలకు అర్చకులు గాయత్రి దేవిగా అలంకరించారు. మండపాల వద్ద కుంకుపూజలు నిర్వహించారు. బలుసుపాడు గురుధాం, చిల్లకల్లు గ్రామంలోని అమ్మవారి విగ్రహాలకు పూజలు చేశారు.

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని నకాశి బజారులోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో శ్రీగాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. అద్దాలబజారులో శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయంలో శ్రీగాయత్రీదేవి అలంకరణలో పూజలందుకున్నారు. దుర్గాపురంలోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో శ్రీబాలత్రిపురసుందరీదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. చెరువుబజారులోని శ్రీరేణుకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రీసోమవంశ సహస్రార్జున క్షత్రియ (ఖత్రి) సమాజ్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అద్దాలబజారులో ఉన్న శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంతో శ్రీలలితాత్రిపుర సుందరీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. మార్కండేయ బజారులో యూత్‌వారు ఏర్పాటుచేసిన మండపంలో అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.



బాలాత్రిపురసుందరీ దేవిగా అంబారుపేట సత్యమ్మ అమ్మవారు



నందిగామలో గాయత్రీ దేవిగా మరిడీ మహాలక్ష్మి అమ్మవారు



పేటలోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయంలో



నందిగామ రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో..



తిరుమలగిరిలో గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారు

వైభవంగా బతుకమ్మ సంబరాలు

పెనుగంచిప్రోలు: మండలంలో బతుకమ్మ సంబరాలు వైభవంగా జరుగుతున్నాయి. మహిళలు పెద్ద సంఖ్యలో బతుకమ్మలను రంగు రంగుల పూలతో, ఆకులతో తయారు చేసి గ్రామంలో ఆట, పాటల మధ్య మునేరులో, కాలువల్లో నిమజ్జనం చేశారు. మంగళవారం పెనుగంచిప్రోలు శ్రీధర్మపురి లక్ష్మీనరసింహస్వామి, శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయాల్లో, లింగగూడెం, ముండ్లపాడు, ముచ్చింతాల గ్రామాల్లో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు.

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక బతుకమ్మ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు మంగళవారం రాత్రి శ్రీముత్యాలమ్మ ఆలయంలో వైభవంగా జరిగాయి. మహిళలు తరలివచ్చి పూజలు నిర్వహించారు. నృత్యాలు, కోలాటాలతో అలరించారు.కమిటీ ప్రతినిధులు కొప్పు అనంతరాజా, తులసి సుబ్బారావు, యర్రా శ్రీనివాసరావు, నోముల శివకుమార్, చెక్కా సుధాకర్ పాల్గొన్నారు.



లింగగూడెంలో బతుకమ్మ వేడుకల్లో మహిళలు

మునేటికి మళ్లీ వరద



లింగాల(వత్సవాయి): మునేటికి ఎగువప్రాంతాలైన తెలంగాణలోని వరంగల్, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు పడడంతో మునేటికి వరదనీరు పోటెత్తింది.మంగళవారం సాయంత్రానికి 8.3 అడుగుల మేర 9,122 క్యూసెక్కుల వరదనీరు వచ్చినట్లు ఇరిగేషన్ అధికారి ఆర్.రామనరసింహారావు తెలిపారు. మునేటికి వరదనీరు వస్తున్న దృష్ట్యా మునేటి కాలువ గేట్లు ఎత్తి నీటిని కిందకు విడుదల చేశారు .

పెనుగంచిప్రోలు: ఎగువన ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు మునేరుకు వరద నీరు వచ్చింది. మంగళవారం పోలంపల్లి డ్యాం వద్ద మునేరుకు సాయంత్రానికి 8 అడుగులు పైన వరద నీరు చేరినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. తెలంగాణలో వర్షాలు పడుతుండటంతో వరద మరింత పెరిగే అవకాశం ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ఏసీపీ తిలక్

వీరులపాడు: పండుగ పేరుతో గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఏసీపీ తిలక్ పేర్కొన్నారు. మండలంలోని నరసింహారావుపాలెం గ్రామంలో దసరా పండుగ సందర్భంగా అమ్మవారి విగ్రహ ఏర్పాటుపై ఇరువర్గాల మధ్య నెలకొన్న ఘర్షణకు సంబంధించి ఇరు వర్గాల ప్రతినిధులతో గ్రామంలోని రామాలయం వద్ద మంగళవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవ కార్యక్రమాలను గ్రామస్తులంతా ఐక్యంగా నిర్వహించుకోవాలన్నారు. పండుగల పేరుతో ఘర్షణలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద ఇరువర్గాల ప్రతినిధుల సమ్మతితో అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. నవరాత్రి ఉత్సవాలు ముగిసే వరకు ఇరు వర్గాల ప్రతినిధులు సమన్వయంతో పని చేసి వివాదాలు, ఘర్షణలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దసరా ఉత్సవాలు ముగిసే వరకు గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఉంటుందన్నారు. నందిగామ రూరల్ సీఐ చౌహాన్, ఎస్ఐలు అనిల్, ధర్మరాజు, డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, సర్పంచ్ బొమ్మిశెట్టి దుర్గాదేవి, ఎంపీటీసీ సభ్యుడు శీలం రమణారెడ్డి, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

26న ఈఎస్ఐ వైద్య శిబిరం

జగ్గయ్యపేట అర్బన్: కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం పరిధిలో ఈనెల 26న ఈఎస్ఐ వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ తులసి వెంకటకృష్ణారావు మంగళవారం తెలిపారు. ఉక్కు కళావేదికలో ఉదయం 7 గంటల నుంచి మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు ఈఎస్ఐ మెడికల్ క్యాంపు నిర్వహించనున్నామన్నారు. శిబిరాన్ని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ప్రారంభిస్తారు. అన్ని రకాల వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారు. అవసరమైన వారికి మెరుగైన వైద్యం కోసం ఉన్నత హాస్పిటల్‌కు సిఫార్సు చేస్తారు. మున్సిపల్ సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోషకాహారం అవసరం



పెనుగంచిప్రోలు: ఆరోగ్య జీవనానికి పోషక విలువలతో కూడిన ఆహారం అవసరమని సర్పంచ్ వేల్పుల పద్మకుమారి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం గ్రామంలో గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సువర్చల, జయలక్ష్మి, నాగమణి, విమల , రాజేశ్వరి, మంజుల, కల్పన, సునీత, తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల పరిషత్ సమావేశం

వీరులపాడు: మండలంలోని జుజ్జూరు గ్రామంలోని మండల పరిషత్‌కార్యాలయంలో ఈ నెల 25న ఎంపీపీ కోటేరు లక్ష్మి అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రూపవతి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు. ఆయా శాఖాధికారులు పూర్తి సమాచారంతో హాజరవ్వాలని తెలిపారు.

మహిళలకు వైద్య పరీక్షలు



చందర్లపాడు(నందిగామ టౌన్): కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యాధికారి సుమని రూత్ పేర్కొన్నారు. స్వస్థ్ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా చందర్లపాడు మండలం లక్ష్మీపురం గ్రామంలో చందర్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాలు, పాలు, గుడ్లు వంటి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. దీని వల్ల సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని తెలిపారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యారోగ్య సిబ్బంది యలమందయ్య, శాంతి, సుధ, మమత, శైలజ, నవీన్‌కుమార్, సామ్రాజ్యం, శ్యామల, ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.